క్లుప్తంగా

కాశీ విశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు



అచ్చంపేట: మండలంలోని చామర్రులో పవిత్ర కృష్ణానది ఒడ్డున గల విఘ్నేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ కాశీ విశ్వేశ్వరునికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రుద్రవరంలో ఫ్యామిలీ పిజీషియన్



రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం ఆదివారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు పీ.రమాదేవి, వి.సూర్యప్రకాశరావులు పాల్గొని 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. వీరితో పాటుగా అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వారి ఇళ్ల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య సేవలు అందించారు. ఎమ్ఎల్‌హెచ్‌పీ రహీమున్నీసా, దివ్యకీర్తి, ఏఎన్ఎమ్ జి.పద్మ, డీఈఓ రవితేజ, రవిచంద్ర, ఎంపీహెచ్ఎస్ ఏ.పీటర్‌డానియేన్, జోస్పిన్‌రాణిలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాలమహానాడు మండల కార్యదర్శిగా గుడిపూడి



పెదకూరపాడు: మాల మహానాడు మండల కార్యదర్శిగా పెదకూరపాడుకు చెందిన గుడిపూడి అశోక్, యూత్ అధ్యక్షుడుగా సాగా జయకృష్ణలను నియమిస్తు రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం పెదకూరపాడులోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మాల మహానాడు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మాలల ఐక్యతకు పాటుపడాలన్నారు. గుడిపూడి అశోక్ మాట్లాడుతూ మాలల సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమం మండల అధ్యక్షుడు సర్వేపల్లి జాన్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చుక్కా పీటర్ పాల్‌కి ఘన నివాళి



సత్తెనపల్లి: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుక్కా చంద్రపాల్ తండ్రి, ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే చుక్కా పీటర్ పాల్ మరణానికి చింతిస్తూ స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పట్టణ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్ అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. చుక్కా పీటర్ పాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. చుక్క పీటర్ పాల్ ఒక ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు 1974 లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి అన్ రిజర్వేషన్ గా పోటీ చేసి, గెలిపొంది నియోజక అభివృద్ధికి, దళితుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జానీ ఖాజావలి, కొత్త.లక్ష్మయ్య, రామకృష్ణ మూర్తి, సీనియర్ నాయకులు చాన్ బాషా, సిద్దెల మోహన రావు, జెట్టి శేఖర్, జిల్లెళ్ళ పాల్ రాజ్, గుజ్జర్లపూడి కన్నా, యెహోబు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

మాచర్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో నియోజక వర్గ క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 9 సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ప్రథమ బహుమతిని వేముల దుర్గ రూ. 12016, ద్వితీయ బహుమతిని కంభంపాటి అనిల్‌కుమార్ రూ. 6016, తృతీయ బహుమతిని వేముల దుర్గ రూ. 3016, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ టౌన్ ముస్లిం యూత్ రూ. 1116లు అందజేయనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌కు ప్రత్యేక అతిథులుగా పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వేముల దుర్గ, సాయి, ఎం జాన్‌సాహెబ్, చిన్ని తదితరులు కోరారు.

అవినీతి రహితంగా సంక్షేమ పథకాల అమలు

- మంచి జరిగిందని భావిస్తే ఆశీర్వదించండి
- మీకందిన సాయాన్ని వివరించేందుకే గడప గడపకు
- రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు



15వ వార్డులో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: సంక్షేమ పథకాల అమలులో ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి కోట్ల రూపాయల జమ చేసి, గత మూడేళ్లలో 95 శాతం పైగా హామీలను అమలు చేశామని, మంచి జరిగిందని భావిస్తే మీరు ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు కోరారు. పట్టణంలోని 15వ సచివాలయం పరిధిలోని 15వ వార్డులో ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గత మూడు ఏళ్లలో మీకు అందిన సంక్షేమ సాయాన్ని వివరించేందుకే గడప గడపకు వస్తున్నామన్నారు. గృహిణులు, వృద్ధులు, వికలాంగులతో ప్రభుత్వ సంక్షేమ లబ్ధి, పథకాలు అందుతున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల సేవలపై ఆరా తీశారు. వార్డు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను విని సత్వరం వాటికి పరిష్కార మార్గాలు చూపించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ. 20 లక్షల నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. పట్టణ స్థాయి నాయకులు, అధికారుల బృందంతో ఇంటింటికి తిరిగి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మీ అందరి ఆశీర్వాదంతో తిరిగి జగన్‌మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిని చేయాలని కోరారు. వార్డుల అభివృద్ధికి నిధులు సమీకరించి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

అడుగడుగునా అపూర్వ ఆదరణ...

పట్టణంలోని 15 అవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన మంత్రి అంబటి రాంబాబుకు వార్డు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రజలతో మమేకమై కుశల ప్రశ్నలతో మాట్లాడిస్తూ వారి యోగక్షేమాలపై ఆరా తీశారు. సమస్యలను ఆలకించి అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరంగా వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదరిక నిర్మూలనకు నిస్వార్థంగా సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతిపక్షాలు స్వార్థంతో వైఎస్ఆర్ సీపీ పై దుష్ప్రచారం చేస్తున్నట్లు తెలియజేశారు. వార్డు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. మొత్తం 293 గృహాలను సందర్శించి ఇంటింటికీ చేకూరిన ప్రభుత్వ లబ్ధిని తెలియచేసి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, 15వ వార్డు కౌన్సిలర్ గంటా రమణమ్మ, గంటా ఏసుబాబు, కమిషనర్ కొలిమి షమ్మీ, నాయకులు అచ్యుత శివప్రసాద్, తుమ్మల వెంకటేశ్వరరావు, లోక మాధవ, గడ్డం వెంకటేశ్వర్లు(బుల్లోడు), బండి మల్లికార్జునరెడ్డి, చిట్టా విజయభాస్కర్ రెడ్డి, పెద్దింటి వెంకటేశ్వర్లు, పెండెం బాబురావు, జొన్నలగడ్డ ఆనంద్, నందిగామ ఆదాం, వల్లెం నరిసింహారావు, పలు వార్డుల కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



కూర్మావతార అలంకరణలో శ్రీవారు



ఆలయంలో ఏర్పాటు చేసిన దీపోత్సవం

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం, వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి కూర్మావతారం అలంకరణ చేపట్టారు. స్వామివారికి దీపోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మంత్రి అంబటి రాంబాబును సాదరంగా స్వాగతించి సత్కరించారు. అంతేకాక గ్రామోత్సవాన్ని మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించారు. మేళ తాళాలు, కనకదుప్పట్లతో కోలాటాలతో అంగరంగ వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అచ్చంపేట: స్థానిక హరిహర క్షేత్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే భజన కార్యక్రమాలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. గోపూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఆత్మకూరి



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న హరేరామచెంచయ్య

సత్తెనపల్లి: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా సత్తెనపల్లి పట్టణానికి చెందిన సిల్వర్ స్టార్ సికెజిఎఫ్ ఆత్మకూరి వెంకట హరే రామచెంచయ్యను నియమించారు. ఆదివారం వినుకొండలోని షిరిడి సాయిబాబా దేవస్థాన కల్యాణ మండపంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 204/ఏ ఇన్‌స్టాలేషన్ ఆఫ్ డిస్టిక్ క్యాబినెట్ -2023 టీం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గవర్నర్ గోల్డెన్ స్టార్ కజ్జాయం విజయలక్ష్మి నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా హరే రామ చెంచయ్యను పుర ప్రముఖులు, ఆర్య వైశ్య నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. వారిలో సత్తెనపల్లి శ్రీనివాస డైమండ్ క్లబ్ ప్రతినిధి అయినవోలు వెంకటేశ్వరరావు, సెక్రటరీ వనమా నాగేశ్వరరావు, వాసవి క్లబ్ ఫ్యామిలీస్ ప్రెసిడెంట్ కోట నాగ వరలక్ష్మి, సెక్రటరీ రెడ్డి సురేష్ కుమార్, తదితరులు ఉన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



వృద్ధురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్, యూనియన్ నాయకులు

నకరికల్లు: స్వగ్రామంలోని పేదలను ఆదుకునేందుకు గ్రామంలోని ఉద్యోగులంతా కలిసి ఎంప్లాయిస్ యూనియన్ స్థాపించినట్లు యూనియన్ అధ్యక్షుడు చందా మీరా అన్నారు. గుండ్లపల్లి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో ఆదివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన చికిలి సైదాబి అనే వృద్ధురాలు ఎవరూలేక అనాథగా ఉండడంతో ఆమెకు కిరాణాసరుకులు, బియ్యం, దుప్పట్లు, కొంతనగదు సాయంగా అందించినట్లు తెలిపారు. సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కొలుముల హిమామ్‌వలి, గౌరవ సలహాదారుడు, విశ్రాంత ఎస్ఐ కరాలపాటి పెంటూ సాహెబ్, సభ్యులు, పలుశాఖల ఉద్యోగులు కరాలపాటి సైదావలి, దాచేపల్లి రహీం, జమాల్, అల్లాబక్షూ, గుత్తికొండ నన్నేసా, గ్రామపెద్దలు అడవి జమాల్ తదితరులు పాల్గొన్నారు.

నాటి జ్ఞాపకాలతో ఆత్మీయ సమ్మేళనం



1981-85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



క్రోసూరు జెడ్పీపాఠశాలలో పూర్వ విద్యార్థులు

పెదకూరపాడు: ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. తను చదువుకునే రోజులు.. చేసే అల్లరి.. స్నేహితుల కోసం చేసే ఫైట్‌లు, ..వారితో కలిసి ఆడిన ఆటలు.. చిన్నచిన్న గ్యాంగ్‌లు అవన్నీ ఓ మధురమైన క్షణాలు.. మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ 37 ఏళ్ల తరువాత కలుసుకుని ఆనందంగా గడిపారు. ఆదివారం 1981-85 బ్యాచ్ పెదకూరపాడు జెడ్పీపాఠశాల విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. వాట్సాప్ వేదికగా గత నాలుగు నెలలుగా మిత్రులందరూ ఒకరినొకరు పరిచయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరి కన్న భిన్నంగా తమకు విద్యాబోధనలు చేసి గురువులను పెదకూరపాడు పురవీధుల్లో ఊరేగించారు. తమతో విద్యాను అభ్యసించి తోటి స్నేహితులు కొందరు మృతి చెందడంతో వారికి నివాళి అర్పించారు. చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో , విదేశాల్లో ఉన్న వారు తమ తోటి స్నేహితులను చూసేందుకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు. కనకయ్య, శివయ్య, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, యల్లారావులు మాట్లాడుతూ తమ వద్ద విద్యాను అభ్యసించిన విద్యార్థులు నేడు స్థిర పడి ఉన్నత శిఖరాల్లో ఉండడం ప్రతి ఉపాధ్యాయుడుకి సంతోషమన్నారు. ఈ సందర్భంగా తెలుగు రుచులతో కూడన విందును ఆరగించి అందరూ ఒకేరకమైనదుస్తులు ధరించి తరగతి గదుల్లో పాత స్మృతులను స్మరించుకున్నారు.

క్రోసూరు: 32 సంవత్సరాల క్రితం నాటి అల్లర్లు, అప్పటి చిలిపి పనులతో సరదా సరదా గా ఆడుకుంటూ, చదువులు చదువుకుంటూ ఆనాటి విదార్థులు, నేడు ఎవరి జీవితాల్లో వారు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిపోయి బీజీ జీవితంలో కూడా ఆనాటి పాఠశాల మిత్రులను కలుసుకోవాలనే ఆత్మీయతతో (1980-90 బ్యాచ్)పదవతరగతి విద్యార్థులు ఆత్మీయక కలయిక ఆదివారం జరిగింది. క్రోసూరు జెడ్పీపాఠశాలలో 32 సంవత్సరాల క్రితం పదోతరగతి విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో ఆత్మీయ సమ్మేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అప్పటి గురువులు జీకేఆర్, వీసీర్, వై. శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. పలువురు పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆనందంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకూడా పాఠశాల ఆవరణలో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో 95 మంది పూర్వ విద్యార్థులు, వారివారి బెటర్ ఆఫ్‌లతో పాల్గొన్నారు.

వైభవంగా పెదకూరపాడు తిరునాళ్ల

- దివ్యపూజ బలి నిర్వహించిన కడప బిషప్ రెవరెండ్ డాక్టర్ గాలిబాలి
- భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్న విశ్వాసులు
- గ్రామ పురవీధుల్లో తేరు ఊరేగింపు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: క్రైస్తవ విశ్వాసులు వైభవంగా 25 సంవత్సరాలు జూబిలి ముగ్గురు రాజుల మహోత్సవాన్ని పెదకూరపాడులో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పండగ సమిష్ట పూజాబలిని కపడ బిషప్ డాక్టర్ రెవరెండ్ గాలిబాలి, నల్గొండ విశ్రాంతి బిషప్ జోసఫ్‌లు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి డాక్టర్ గాలి బాలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్షమ,దయ, ప్రేమ, కరుణ కలిగి ఉండటమే క్రైస్తవ విశ్వాసులకు నిదర్శనమని తెలిపారు. దివ్య నక్షత్రం చూపిన మార్గంలో నడిచిన ముగ్గురు రాజులు బాలయేసును దర్శించుకుని మహిమత్వాన్ని పొందారన్నారు. దీనిని పురస్కరించుకుని ప్రతి ఏడాది ముగ్గురు రాజుల మహోత్సం జరుపుకుంటారని తెలిపారు. క్రైస్తవ విశ్వాసులు ఒత్తులను సమర్పించారు. రాత్రి బాలయేసుతో కూడిన మేరిమాత విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో కనకతప్పెట్లు , బ్యాండు మేళాలతో ఊరేగించారు. స్థానిక విచారణ గురువులు పుట్టి సుందరరాజు, సంతోష్‌లు పండగ ఏర్పాట్లును పర్యవేక్షించారు. పలువురు భక్తులు మొకాళ్లపై నడిచి తమ మొక్కులను తీర్చుకున్నారు. సీఐ వీరస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రత్యేక ప్రార్థనలు..

పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకర రావు పెదకూరపాడులోని ముగ్గురు రాజుల తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్ని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు మార్గన్ని ఆదర్శంగా తీసుకుని 2023లో ప్రభువు దీవెనలతో సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు కంకణాల శివాజీ, మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్‌షరీఫ్, ఎంపీటీసీ కంచర్ల నిర్మల, నల్లపాటి యోహన్ , సాతులూరి రాజు పాల్గొన్నారు.



పండగ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు



వీఆర్వోల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు

క్రోసూరు: వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ బి.శ్రీనివాసరావు కోరారు. ఆదివారం క్రోసూరు రెవెన్యూ కార్యాలయంలో మండల వీఆర్వోల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనలో ప్రజలు ఇచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. అదేవిధంగా కుల ,ఆదాయ సర్టిఫికెట్ల విషయంలో పెండింగ్‌లు ఉంచకూడదన్నారు. సచివాలయాల పరిధిలో చేపట్టిన జగనన్న భూహక్కు- భూసర్వే పనుల సందర్భంగా ఆయా రైతులకు అందుబాటులో ఉండాలని, రైతులు తమ తమ హక్కు పత్రాలు అందచేసే విధంగా గ్రామంలో ప్రచారాలు చేసి నివేదికలు త్వరగా తయారు చేసుకోవాలన్నారు. అదేవిధంగా రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేవిధంగా తనిఖీలు చేపడుతుండాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆరుగురు కోడిపందేల రాయుళ్ల అరెస్ట్



పోలీసులు అదుపులోకి తీసుకున్న కోడిపందేల రాయుళ్లు

క్రోసూరు: క్రోసూరు మండలం ఎర్రబాలెం గ్రామ శివారు సత్తెనపల్లి రోడ్డు కాలువగట్టు పొలాల్లో ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ, పోలీసులు దాడులు నిర్వహించి కోడిపందేలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6200 , రెండు కోడిపుంజులను స్వాధీన పరుచుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులు, సయ్యద్ మస్తాన్, ఉప్పలపాటిగోపి, చింతారాజు, గంజా వెంకటసాయి, కొమెరశ్రీకాంత్, చిలకా మల్లికార్జునరావులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కోండి పందేలు , పేకాట ఆడితే కఠిన మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు రామయోగి స్వామి తిరునాళ్ల

నూజెండ్ల: మండల కేంద్రమైన నూజెండ్లలో అవధూత పొట్లపాటి రామయోగి స్వామి తిరునాళ్ల సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్వామివారి దేవాలయాన్ని కొత్తరంగులతో సర్వాంగ సుందరంగాతీర్చి దిద్దారు. ఏడాదిలో మొట్టమొదటిగా వచ్చే తిరునాళ్ల రామయోగి స్వామిదే కావటం విశేషం. గ్రామంలోని నాలుగు దిక్కులలోని పాదులకు అభిషేకాలు చేయడంతో తిరునాళ్ల ప్రారంభమౌతుంది. తిరునాళ్ల సందర్భంగా ప్రధాన రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఐనవోలు ఎస్ఐ అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసు వారి అనుమతి తీసుకోవాలని ఎస్ఐ తెలిపారు.

నేడు ముగ్గుల పోటీలు

సత్తెనపల్లి: మహిళలను ప్రోత్సహించేందుకు వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లో భాగంగా మున్సిపాలిటీ స్థాయిలో ముగ్గుల పోటీలను సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతాయని మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి ఆదివారం తెలిపారు. ఇటీవల వార్డు స్థాయిలో గెలుపొందిన మహిళలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పోటీలను తిలకించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు హజరౌతారన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలతోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు మండల స్థాయి ముగ్గుల పోటీలు

రాజుపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల స్థాయి వైఎస్సార్ గ్రామీణ సంక్రాంతి ముగ్గుల పోటీలను సోమవారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరీ చంద్రమౌళిలు ఆదివారం తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లో ఎంపికైన గ్రామస్థాయి విజేతలు పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు పాల్గొని బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ గీతాహాసంతి, భవనం రాఘవరెడ్డి

నకరికల్లు: ముగ్గుల పోటీల వేడుకలు సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చిందా అన్నట్లు వేడుకలా జరుగుతున్నాయని మహిళాసంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ గీతాహాసంతి అన్నారు. మండలస్థాయి ముగ్గులపోటీలు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అలనాటి సంస్కృతి, సాంప్రదాయాలను నేటితరాలకు పరిచయం చేసేందుకు రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోను ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజకవర్గస్థాయి విజేతలకు బహుమతులు అందించడమే కాక పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.

విజేతలు వీరే...

నకరికల్లులో నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సానా అశ్వని (చల్లగుండ్ల) రూ.25,000లు, ద్వితీయ బహుమతి పాలపాటి తిరుపతమ్మ (చల్లగుండ్ల) రూ.15000లు, తృతీయబహుమతి కోడెల ప్రసన్న (చాగల్లు)రూ. 10,000లు, నాలుగవ బహుమతి ఉయ్యాల సుహాసిని(చల్లగుండ్ల) రూ.5,000లు, కన్సోలేషన్ బహుమతి పూల శ్రీలత(కుంకలగుంట)లు కై వసం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీబాషా, ఎంపీటీసి సభ్యురాలు బైరెడ్డి ధనలక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ షేక్.మస్తాన్‌వలి, మండలంలోని పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసి సభ్యులు, అనుబంధసంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

11న వడ్డే ఓబన్న జయంతి

సత్తెనపల్లి: పట్టణంలోని 24 వార్డు సాలిపేట నందు గల శ్రీ తేనె అంకమ్మ తల్లి దేవస్థానంలో ఈ నెల 11న ఉదయం 9 గంటలకు వడ్డే ఓబన్న జయంతి ఉత్సవం జరుగుతుందని సత్తెనపల్లి పట్టణ వడ్డెర సేవా సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. వడ్డెర సంఘ పెద్దలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ళ: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు వాటి వివరాలను ఈ-క్రాప్ కింద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ ఆదివారం చెప్పారు. జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి, వరిగలు, వరి, పెసర, మినుము, నువ్వులు, అలసందలు, శనగలు, పొగాకు, ఇంక కూరగాయల పంటలు సాగు చేసిన రైతులు నమోదు చేసుకోవచ్చన్నారు. అందుకు గాను ఆధార్‌కార్డు, పట్టాదారుపాసుపుస్తకం, బ్యాంక్‌ఖాతా వివరాలు, ఫోన్‌నంబర్‌లతో పంటనమోదు అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. ఆయా వివరాలతో రైతుభరోసా కేంద్రంలోను సంప్రదించి నమోదు చేసుకోవచ్చన్నారు. అవకాశాన్ని రైతులు తప్పకుండా వినియోగించుకోవాలన్నారు.